

# నేటి నిజం

తెలుగు దినపత్రిక




website:www.netinijam.com    E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్    బుధవారం 28-7-2021    RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    సంపుటి :27    సంచిక: 289    పేజీలు: 4    వెల: రూ.1/-


## కొవిడ్ నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు జరుపుకోవాలి : మంత్రి తలసాని



హైదరాబాద్ , జులై 27: భక్తులు కొవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆషాఢ బోనాల ఉత్సవాలను జరుపుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచిం చారు. నగరంలోని గోషామహల్, కార్వాన్ నియోజకవర్గాల పరిధి లోని 572 ఆలయాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ.2.37 కోట్ల చెక్కులను కమిటీ సభ్యులకు ఇవాళ మంత్రి తలసాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాలకు ప్రభుత్వం రూ. 15 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. పాతబస్తీ బోనాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కరోనా దృష్ట్యా భక్తులు విధిగా మాస్కులు ధరించాలని, చేతులను శానిటైజ్ చేసుకోవాలని సూచించారు. ప్రశా ంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో అమితాబ్ బచ్చన్..

న్యూఢిల్లీ, జులై 27:ఎంపీ సంతోష్ కుమార్ శ్రీకారం చుట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు, పద్మవిభూషణ్ అమితాబ్ బచ్చన్ ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. రామోజీఫిలిం సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో బిగ్ బితోపాటు అక్కినేని నాగార్జున, నిర్మాత అశ్వినీదత్, ఫిలిం సిటీ ఎండీ విజయేశ్వరి పాల్గొన్నారు.

ఎంపీ సంతోష్ కుమార్ భావి తరాలకు ఉపయోగపడే మంచి కార్యక్రమం చేపట్టారని ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ అన్నారు. బిగ్ బీ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొన్న విషయాన్ని ఎంపీ సంతోష్ కుమార్ ట్విటర్ ద్వారా షేర్ చేశారు. అమితాబ్ బచ్చన్ కు వృక్ష వేదం పుస్తకాన్ని అందజేసి.. పుస్తకంలో పొందుపర్చిన అంశాల గురించి వివరించినట్టు ట్వీట్ లో పేర్కొన్నారు ఎంపీ సంతోష్ కుమార్.

## ప్రధాని మోదీని కలిసిన మమతా బెనర్జీ



న్యూఢిల్లీ, జులై 27:పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇవాళ ప్రధాని మోదీని కలిశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆమె 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న మోదీ నివాసానికి వెళ్లారు. ఇటీవల బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ఇద్దరూ ఢిల్లీలో తొలిసారి కలుసుకున్నారు. రాష్ట్రానికి బాకీ ఉన్న నిధులను విడుదల చేయాలని మమతా కోరినట్లు తెలుస్తోంది. కరోనా వైరస్ వ్యాక్సిన్లను కూడా అధిక మొత్తంలో రిలీజ్ చేయాలని ఆమె అభ్యర్థించారు. యశ్ తుఫాన్ సమీక్ష సమయంలో స్వల్ప వ్యవధి పాటు మే నెలలో ఇద్దరూ మాట్లాడుకున్న విషయం తెలిసిందే.

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పేరును మార్చాలన్న పెండింగ్ అంశాన్ని కూడా మోదీతో గుర్తు చేస్తున్నట్లు దీదీ తెలిపారు. దీని గురించి ఆలోచిస్తామని మోదీ చెప్పినట్లు ఆమె వెల్లడించారు. పార్లమెంట్‌లో దుమారం రేపుతున్న పెగాసస్ వ్యవహారంపై ప్రధాని మోదీ అఖిల పక్ష భేటీ నిర్వహించాలన్నారు. ఈ అంశంలో సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టాలని దీదీ కోరారు. ఇవాళ ఉదయం ఢిల్లీలో కాంగ్రెస్ నేత కమల్‌నాథ్‌ను ఆమె కలిశారు. రేపు సోనియాతోనూ దీదీ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ ఉదయం మమతా బెనర్జీ ఢిల్లీ చేరుకున్నారు.

## పార్లమెంట్‌లో మళ్లీ అదే సీన్.. ఉభయసభలు వాయిదా



న్యూఢిల్లీ, జులై 27:పార్లమెంట్‌లో విపక్షాలు నినాదాలతో హోరెత్తిస్తున్నారు. లోక్‌సభ, రాజ్యసభలో ఇవాళ ఉదయం భారీ స్థాయిలో విపక్షాలు నిరసన నినాదాలు వినిపించాయి. రాజ్యసభలో విపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. పెగాసస్ ప్రాజెక్టు నివేదికపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ చట్టాలు చేసేందుకు ఉందని, కానీ సభ కార్యక్రమాలను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నట్లు వెంకయ్య అన్నారు. పార్లమెంట్ దిగజారిన తీరు దురదృష్టకరమని ఆయన అన్నారు. అయినా విపక్ష సభ్యులు పట్టువీడకపోవడంతో సభను ఆయన 12 గంటల వరకు వాయిదా వేశారు. ఇక లోక్‌సభలో కూడా విపక్ష సభ్యులు నినాదాలతో కార్యక్రమాలను అడ్డుకున్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేశారు. నినాదాలు తీవ్ర స్థాయికి చేరడంతో.. స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు.

## ఆ టీకాలు తీసుకున్నవారిలో యాంటీ బాడీలు తగ్గుతున్నాయి..

లండన్, జులై 27:: ఫైజర్, ఆస్ట్రాజెనికా టీకాలు తీసుకున్న వారిలో ఆరు వారాల తర్వాత యాంటీబాడీల సంఖ్య తగ్గుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇక పది వారాల తర్వాత వాటి సంఖ్య 50 శాతం పడిపోయే అవకాశాలు ఉన్నట్లు ద లాన్సెట్ జర్నల్ తన పత్రికలో ప్రచురించింది. బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ కాలేజ్ లండన్(యూసీఎల్) పరిశోధకులు ఈ విషయాన్ని తెలిపారు. ఒకవేళ ఇలాగే యాంటీబాడీల సంఖ్య తగ్గుతూపోతుంటే, అప్పుడు కొత్త వేరియంట్లతో ప్రమాదం ఏర్పడే అవకాశాల ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. ఆస్ట్రాజెనికా టీకాలను కోవీషీల్డ్ పేరుతో ఇండియాలో పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. రెండు డోసుల కోవీషీల్డ్ కన్నా.. రెండు డోసుల ఫైజర్ చాలా మేలు అని లండన్ వర్సిటీ పరిశోధకులు చెప్పారు. అయితే వ్యాక్సిన్లు తీసుకున్నవారిలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు అంచనా వేశారు.

ఆస్ట్రా, ఫైజర్ రెండు డోసుల టీకాల వల్ల మొదట్లో అధిక స్థాయిలో యాంటీబాడీలు ఉన్నాయని, వాటి వల్లే ఇన్‌ఫెక్షన్ తగ్గినట్లు గుర్తించామన్నారు. కానీ రెండు లేదా మూడు నెలల్లో రోగనిరోధక శక్తి కణాల సంఖ్య తగ్గుతున్నట్లు మధుమిత్రా సోత్రి తెలిపారు. 18 ఏళ్లు దాటిన 600 మందిపై చేపట్టిన సర్వే ఆధారంగా ఈ విషయాన్ని తేల్చారు. ఫైజర్ తీసుకున్నవారిలో 21 నుంచి 41 రోజుల మధ్య 7506 యూనిట్లుగా ఉన్న యాంటీబాడీలు.. 70 రోజులు దాటిన తర్వాత ఆ సంఖ్య 3320 జ/ఎఒ కు పడిపోయినట్లు గుర్తించారు. ఇక ఆస్ట్రాజెనికా టీకా వేసుకున్నవారిలోనూ.. 20 రోజుల వరకు 1201జ/ఎఒగా ఉన్న యాంటీబాడీల సంఖ్య 70 రోజుల తర్వాత అయిదు రేట్లు తగ్గినట్లు గుర్తించారు. ఆస్ట్రాజెనికా టీకా తీసుకున్నవారిలో యాంటీబాడీల సంఖ్య తక్కువగా ఉందని, వారికి మొదటగా బూస్టర్ డోసులు ఇవ్వాలని సూచించినట్లు ప్రొఫెసర్ రాబ్ ఆల్డ్రిజ్ తెలిపారు.

## ఆగస్టు నుంచి పిల్లలకు కోవిడ్ టీకాలు: కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి

న్యూఢిల్లీ, జులై 27:ఆగస్టు కల్లా చిన్నపిల్లలకు కోవిడ్ టీకాలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ వెల్లడించారు. ఇవాళ బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తమ పార్టీ ఎంపీలకు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇవాళ రాజ్యసభలోనూ పిల్లల వ్యాక్సినేషన్ గురించి ఓ సభ్యుడు ప్రశ్నించారు. ఆ సమయంలో మంత్రి సమాధానం ఇవ్వబోయారు. కానీ విపక్ష సభ్యుల నినాదాల మధ్య ఆరోగ్య మంత్రి ఇచ్చిన సమాధానం సరిగా వినపడలేదు.

ప్రస్తుతం ఇండియాలో రెండు కోవిడ్ టీకాలను పిల్లలపై ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జైడస్ క్యాడిలా ఇచ్చిన రిపోర్ట్‌ను డ్రగ్ రెగ్యులేటర్ పరిశీలిస్తున్నది. 12 నుంచి 18 ఏళ్ల మధ్య పిల్లలపై జైడస్ కోవిడ్ టీకా ట్రయల్స్ నిర్వహించింది. ఇక భారత్ బయోటెక్ సంస్థ కూడా 2 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలపై రెండవ, మూడవ దశ ట్రయల్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు టీకాల ఫలితాల ఆధారంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ ఉంటుందని ఇటీవల లోక్‌సభలో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి పవార్ తెలిపారు.

## హుజురాబాద్ లో గెలుపు ఈటలకు కష్టమేనా?

హైదరాబాద్ , జులై 27:హుజూరాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రాకముందే రాజకీయం వేడెక్కుతోంది. ఉపఎన్నిక కోసం అటు ఈటల, ఇటు టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎత్తులుపై ఎత్తులు వేస్తున్నారు. పాదయాత్రతో తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించే పనిలో ఈటల ఉండగా? దళిత బంధు అంటూ కొత్త పథకంలో సీఎం కేసీఆర్ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. గెలుపు తమదే అంటూ బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు గట్టి విశ్వాసంతో ఉన్నారు. అయితే, ఈటలను చిత్తు చేసేందుకు సీఎం కేసీఆర్ ఏకంగా అభివృద్ధి పేరుతో హుజూరాబాద్ కు వందల కోట్లు కుమ్మరిస్తున్నారు. బీసీల్లో ఈటలకు పట్టుఉండడంతో కేసీఆర్ ఎస్సీల వైపు నుంచి నరుక్కుంటూ వస్తున్నారు.

హుజూరాబాద్ ఉప ఎన్నిక ఎప్పుడు జరిగినా ఈటల రాజేందర్‌ను ఓడించడం ద్వారా రాజకీయాల నుంచి శాశ్వతంగా ఇంటికి పంపించాలని సీఎం కేసీఆర్ గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఆరు ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో విజయం సాధించిన ఈటలను ఢీకొట్టడమే కాకుండా రాజకీయాలకు ఆయనను దూరం చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఈటల ఢీకొట్ట గలిగిన నాయకుడు ఎవరూ లేకుండా పోవడం ఆ పార్టీకి మైనస్‌గా మారింది. బలమైన బీసీ నాయకుడిగా ఉన్న ఈటలపై మరో బీసీ నాయకుడిని రంగంలోకి దింపాలా, లేక నియోజకవర్గంలో రాజకీయ ఆధిపత్యం కలిగి ఉన్న రెడ్డి అభ్యర్థిని నిలబెట్టాలా, అత్యధిక ఓట్లు ఉన్న దళిత అభ్యర్థిని తెరపైకి తేవాలా అన్న విషయంలో పార్టీ తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయంలో ఇంకా ఏ నిర్ణయానికి రాకున్నా కేసీఆర్, టీఆర్ఎస్ ద్వారానే అభివృద్ధి సాధ్యమనే నినాదంతో ప్రజల్లోకి వెళ్ళాలని నిర్ణయించింది. అంతేకాదు ఈటలకు ప్రధాన అనుచరులుగా ఉన్న కొందరిని టార్గెట్ చేసిన టీఆర్ఎస్.. నెమ్మదిగా ఈటల నుంచి వారిని దూరం చేస్తోంది.

ఈ క్రమంలో ఈటల రాజేందర్ ముఖ్య అనుచరులు బీజేపీకి రాజీనామా చేశారు. ఈటల ముఖ్య అనుచరుడుగా ఉన్న దేశిని కోటి, ఆయన సతీమణి, జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న టీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించి ఈటలకు షాకిచ్చారు. టీఆర్ఎస్ గుర్తుపై గెలిచామని, టీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని కోటి, స్వప్న ప్రకటించడం ఈటల వర్గానికి షాక్ కి గురి చేసింది. ఇటీవల ఈటల ముఖ్య అనుచరుల్లో ఒక్కరైన బండా శ్రీనివాస్ కూడా టీఆర్ఎస్ గూటికి చేరారు. ఈ నేపథ్యంలోనే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బండా శ్రీనివాస్‌ను సీఎం కేసీఆర్ నియమించారు. ఈ క్రమంలో ఈటలకు గెలుపుపై ఆశలు సన్నగిల్లేలా కేసీఆర్ ప్రణాళికలు రచిస్తున్నారు. కేసీఆర్ వేస్తున్న స్కెచ్లను బీజేపీ అంచనా వేయలేకపోతోంది.

ఈటల రాజీనామాతో ఆయనపై వచ్చిన సానుభూతి ఇప్పుడు క్రమంతో తగ్గుతోందని టీఆర్ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధానంగా ఎస్సీ, రెడ్డి సామాజిక వర్గాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే దళిత బంధు అంటూ కొత్త నినాదం ఎత్తుకోవడంతో ఇరత పార్టీ నాయకులను ఆకర్షిస్తున్నారు. బీజేపీకి చెందిన మాజీ మంత్రులు మోత్కుపల్లి నరసింహులు, పెద్దిరెడ్డిలు టీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు రెడీ అయ్యారు. కేసీఆర్ ప్లాన్ తో బీజేపీకి పెద్ద దెబ్బే పడింది. బీసీ ఓట్లు తక్కువ పడినా.. ఎస్సీ, రెడ్డి సామాజిక వర్గం ఓట్లతో ఉప ఎన్నికల్లో గట్టెక్కొచ్చు అనేది గులాబీ దళపతి కేసీఆర్ వ్యూహంగా తెలుస్తోంది.

## నవంబర్ 5 తర్వాత హుజురాబాద్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడే ఛాన్స్..?

హైదరాబాద్ , జులై 27:హుజూరాబాద్ ఉపఎన్నికలపై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.. ఈటల రాజేందర్ బీజేపీలో చేరడం..క్రితం సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కౌశిక్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.. ఈటల రాజేందర్ కి చెక్ పెట్టాలనే టీఆర్ ఎస్ పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. గెలుపు కోసం అధికార పార్టీ అయితే.. అన్ని వ్యూహాలను రచిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కౌశిక్ రెడ్డిని టీఆర్ఎస్ లో చేర్చుకోగా.. ఇప్పుడు మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కూడా లాగే ప్రయత్నాల్లో ఉంది. ఇది ఇలా ఉండగా.. ఈ ఉప ఎన్నికకు కౌంట్‌డౌన్ మొదలైం దని సమాచారం అందుతోంది. హుజురాబాద్ ఉప ఎన్నిక నోటిఫికేషన్? నవంబర్ 5 తర్వాత వెలువడే ఛాన్స్ ఉన్నట్లు.. అధికార పార్టీ నేతల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే.. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది. ఇక ఉపఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందే హుజు రాబాద్‌లో సందడి మొదలైంది. రాజకీయ పార్టీలు ప్రచార హోరును పెంచుకుంటూ పోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అందరి చూపు హుజూరాబాద్ ఉపఎన్నికపైనే ఉంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ కోరిన భావము ముఖమున
తీరుగ పలికించ గలుగు తేజశ్శాలిన్
ధీరుని మనమున దలచెద
కూరిమి రూపైన "రావి కొండలరావు"ను !!

(జులై 28 రావి కొండలరావు పుణ్యతిథి..) -రాధశ్రీ



సెల్: 9494481210

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ సుమన్

మంచిర్యాల, జులై 27: : చెన్నూరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ పురాణపు సతీశ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పలు చోట్ల రేషన్ కార్డులు అందించారు. మందమర్రి నుంచి ఆవడం వరకు 8.45 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ సుమన్, ఎమ్మెల్సీ పురాణం సతీశ్ శంకుస్థాపన చేశారు. మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులు అందించించారు. అలాగే మందమర్రి మున్సిపాలిటీలో రూ.30కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 560 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను విప్ బాల్క సుమన్ పరిశీలించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో 33/11కెవి సబ్ స్టేషన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.




# కోవిడ్-19 విపత్తుతో చితికిన మధ్య తరగతి వర్గాలు

ప్రపంచవ్యాప్తంగా కరోనా కోరల్లో చిక్కిన మధ్య తరగతి వర్గాలు ఆర్థిక చిక్కుల్లో అస్తవ్యస్తం కావడం, మిలియన్ల మిడిల్ క్లాస్ వర్గాలు (దాదాపు 3వ వంతు) అల్పాదాయ పేదరికంలోకి నెట్టబడ్డారని గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా, 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన ఇండియాలో కరోనా దుష్ప్రభావంతో పేదరికం పెరగడం గమనించబడింది. కరోనా ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై అధికంగా, చైనా ఆర్థిక వ్యవస్థపై వైరస్ ప్రభావం తక్కువగా పడడం గమనించారు. ప్రపంచ జనాభా 788 కోట్లు ఉండగా చైనా(141 కోట్లు), భారత్ (138 కోట్లు)ల జనాభా మె?త్తం దాదాపు 279 కోట్లు ఉండడం మనకు తెలుసు. గత మార్చి 2020 నుంచి కరోనా మహమ్మారి విధించిన లాక్‌డౌన్, కర్ఫ్యూ, వైరస్ క్రమశిక్షణలతో దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ప్రజల ఆదాయవ్యయాలను బట్టి జనాభాను ఐదు భాగాలుగా విభజించారు. పేదలు, అల్పఆదాయ, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి మరియు అధిక ఆదాయ వర్గాలుగా వర్గీకరించారు. పేదల దినసరి ఆదాయం 2 డాలర్లు లేదా అంత కన్న తక్కువ, అల్పాదాయ వర్గాల దినసరి ఆదాయం 2.01 - 10 డాలర్లు, మధ్య తరగతికి 10.01-20 డాలర్లు, ఎగువ మధ్య తరగతికి 20.01-50 డాలర్లు, అధిక ఆదాయ వర్గాలకు దినసరి ఆదాయం 50 డాలర్ల కన్న అధికంగా ఉంటుంది.

భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం:

కరోనాకు పూర్వం భారతదేశంలో 99 మిలియన్ల మధ్య తరగతి వర్గాలు ఉండగా, కరోనా అనంతరం 66 మిలియన్లు మాత్రమే మిగిలారని తెలుస్తున్నది. కరోనా మహమ్మారి దెబ్బకు భారత మధ్య తరగతి, 3వ వంతు అనగా 33 శాతం తగ్గిందని గమనించారు. కరోనాకు ముందు పేదలు 59 మిలియన్లు ఉండగా నేడు 134 మిలియన్లకు పెరగడం ప్రమాదకర పరిణామంగా గమనించాలి. అల్పఆదాయ వర్గాల ప్రజలు నాడు 1,197 మిలియన్లు ఉన్నారని, నేడు కరోనా అనంతరం 1,162 మిలియన్ల ఉన్నారని అంచనా వేశారు. ఎగువ మధ్య తరగతి ప్రజలు కరోనాకు పూర్వం 22 మిలియన్లు, నేడు 16 మిలియన్లు మాత్రమే మిగిలారు. అధిక ఆదాయ వర్గాల ప్రజలు నాడు 3 మిలియన్లు, నేడు 2 మిలియన్లు ఉన్నారని తెలుస్తున్నది. భారత్‌లో పేదరిక రేటు జనవరి 2020లో 4.3 శాతం ఉండగా, 2020 చివరన 9.7 శాతానికి పెరగడం పెద్ద సమస్యగా పరిణమించింది. ప్రపంచంలోని పేద, అల్పాదాయ వర్గాలలో 30 శాతం (120 కోట్లు) మంది ఇండియాలోనే ఉన్నారని అంచనా. 2011 నుంచి 2019 వరకు భారత్‌లో పేదరికం 340 మిలియన్ల నుంచి 78 మిలియన్లకు తగ్గడం గమనించారు. కరోనా ప్రభావంతో పేదలు 75 మిలియన్లు పెరగడం విచారకరం. 2011 నుంచి 2019 వరకు మధ్య తరగతి వర్గాలు 57 మిలియన్లు పెరగారని, కాని కోవిడ్-19 దెబ్బకు అదే మధ్య తరగతి ప్రజలు 32 మిలియన్లు తగ్గడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం పడనుంది. జనవరి 2020తో పోల్చితే జనవరి 2021లో ఇండియాలో 9.6 శాతం అభివృద్ధి పడిపోయిందని, చైనాలో మాత్రం 2 శాతం అభివృద్ధి పెరిగిందని గణాంకాలు వివరిస్తున్నాయి.

**చైనా ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం:**

చైనాలో మాత్రం కరోనా ప్రభావం ఆదాయ వర్గాలపై పెద్ద మార్పులు చూడలేదని తెలుస్తున్నది. కరోనాకు ముందు చైనా మధ్య తరగతి వర్గాల ప్రజలు 504 మిలియన్ల ఉన్నారని, కరోనా అనంతరం 493 మిలియన్లు ఉన్నారని గమనించారు. చైనాలో కరోనాకు ముందు పేదలు 3 మిలియన్లు, తరువాత 4 మిలియన్లు ఉన్నారు. అల్పాదాయ వర్గాలు నాడు 611 మిలియన్లు, నేడు 641 మిలియన్లు ఉన్నారు. అధిక ఆదాయ వర్గాలు చైనాలో కరోనాకు పూర్వం 26 మిలియన్లు ఉన్నారని, కరోనా అనంతరం 23 మిలియన్లక తగ్గారని తెలుస్తున్నది. ప్రపంచ మధ్య తరగతి జనాభాలో 37 శాతం చైనీయులే ఉన్నారు. ఈ గణాంకాలను బట్టి చైనా ప్రజలపై కరోనా ప్రభావం చాలా తక్కువగానే పడిందని అర్థం అవుతున్నది.

**త్రిశంకు స్వర్గంలో మధ్య తరగతి వర్గాలు :**

దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి మధ్య తరగతి ప్రజల పాత్ర అద్వితీయమని తెలుసుకోవాలి. మధ్య తరగతి వర్గాలు వృత్తి ఉద్యోగాలు, వ్యాపారాలు, స్వంత గృహాలు, రిటైర్‌మెంట్ భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లల విద్య కోసం ఖర్చులతో తరువాత తరం బాగుండాలనే తపన కోసం జీవితాలను దారపోస్తారని తెలుస్తున్నది. ఆర్థిక వ్యవస్థ దిగజారకుండా చూస్తూనే అసమానతలు పెరగకుండా మధ్య తరగతి వర్గం దోహదపడుతున్నది. పేదలకు, ధనికులకు మధ్య అంతరాలతో వెలువడే అస్థిరత్వాన్ని మధ్య తరగతి తగ్గిస్తున్నది. బలమైన మధ్య తరగతి అధికంగా ఉన్న దేశాలన్నీ అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్నాయని, మధ్య తరగతి వర్గాలు నైపుణ్య మానవ వనరులు, పబ్లిక్ సేవల నాణ్యత - పారిదర్శకతలను అందించడమే కాకుండా మదుపు - పొదుపుతో దేశ ఆర్థికాన్ని బలోపేతం చేస్తున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా బలమైన మధ్య తరగతి ప్రజలు ఆస్తి పరిరక్షణ హక్కులు, పారదర్శక పాలనలను కోరుకుంటున్నారు. దేశంలో కరోనా విపత్తుతో చితికి పోయిన మధ్య తరగతి వర్గాల అసహనానికి ముఖ్య కారణాలుగా పన్నుల పెరుగుదల, పెట్రోల్ డిజిల్ ధరలు, యల్‌పిజీ గ్యాస్ బండ భారం కావడమే అని అర్థం అవుతున్నది. గృహ నిర్మాణ రుణాల వెసులుబాటు, ఉచిత ఆరోగ్య పథకాలు, చవకైన ఉన్నత విద్య, సరళ పన్ను విధానం, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి కావాలని మిడిల్ క్లాస్ ప్రజలు కోరుకుంటున్నారు. సాధారణంగా ప్రభుత్వ పథకాలు పేదవర్గాలకు లేదా ధనిక వర్గాలకు మాత్రమే అనుకూలంగా ఉంటాయి. మధ్య తరగతి వర్గాల గూర్చి ప్రభుత్వాలు ఆలోచించే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తాయి. నేటి విశ్వ మహమ్మారి విలయ కాలంలో మధ్య తరగతి వర్గాలను అక్కున చేర్చుకొని, వారి సేవలను దేశాభివృద్ధికి వినియోగించుకోవాలని కోరుకుంటున్నారు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఖాదీ సహజ పెయింట్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జులై 27:ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) యొక్క యూనిట్ అయిన.. జైపూర్‌లోని కుమారప్ప నేషనల్ హ్యాండ్‌మేడ్ పేపర్ ఇన్‌స్టిట్యూట్ (కేఎన్‌హెచ్‌పిఐ) ఆవు పేడ నుండి ఖాదీ ప్రకృతిక్ పెయింట్‌ను అభివృద్ధి చేసింది. కేఎన్‌హెచ్‌పిఐ అధ్యయనంలో ఖాదీ ప్రకృతిక్ పెయింట్ పర్యావరణ అనుకూలమైనదిగా తెలింది. అత్యంత అనుకూలమైన ధరల్లో పెయింట్ లభిస్తోంది. కేఎన్‌హెచ్‌పిఐ అభివృద్ధి చేసిన ఖాదీ ప్రకృతిక్ పెయింట్‌ను నేషనల్ టెస్ట్ హౌస్, ఘజియాబాద్ (భారత ప్రభుత్వం), నేషనల్ టెస్ట్ హౌస్ ముంబయి (భారత ప్రభుత్వం) మరియు శ్రీ రామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, న్యూఢిల్లీ (ఒక ఐఎస్ఓ సర్టిఫికేట్ టెస్ట్ ల్యాబ్) లోనూ పరీక్షించబడింది. ఈ కొత్త ప్రాకృతిక పెయింట్ అవసరమైన పారామితులను సంతృప్తిపరిచింది. ఈ ఖాదీ ప్రకృతిక పెయింట్ తయారీకి గాను ఆవు పేడను ఉపయోగించడం వల్ల.. ఇది స్థానిక తయారీని ప్రోత్సహిస్తుంది. మేటి స్థిరమైన ఉపాధి కల్పిస్తుంది, రైతులకు మరియు ఆవు ఆశ్రయ గృహాలకు అదనపు ఆదాయాన్ని ఇస్తుంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఉపాధి లభిస్తుంది. ఈ సమాచారాన్ని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి శ్రీ నారాయణ్ రాణే రాజ్యసభకు ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

# జాతీయ రహదారుల వెంబడి మద్యం దుకాణాల తొలగింపు

న్యూఢిల్లీ, జులై 27:జాతీయ రహదారుల వెంబడి మద్యం దుకాణాలను తొలగించే అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. గౌరవనీయమైన సుప్రీంకోర్టు 2016 యొక్క సివిల్ అప్పీల్ నెం 12164-12166 (తమిళనాడు రాష్ట్రం మరియు ఇతరులు ఎబ కే. బాలు మరియు ఇతరులు )లో15.12.2016 మరియు 30.11.2017 న జారీ చేసిన ఉత్తర్వులలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల వెంబడి మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడానికి లైసెన్సులను జారీ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసింది. జాతీయ మరియు రాష్ట్ర రహదారుల వెంబడి మరియు జాతీయ లేదా రాష్ట్ర రహదారుల వెలుపలి అంచు నుండి 500 మీటర్ల దూరం లేదా రహదారి సర్వీస్ లేన్ లో దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులను మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 20,000 లేదా అంతకంటే తక్కువ జనాభా కలిగి ఉన్న స్థానిక సంస్థలలో అధికార పరిధిలో ఈ దూరం 500 మీటర్ల నుంచి 220 మీటర్లకు తగ్గించబడుతుంది.

సుప్రీం కోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. ఇంతేకాకుండా, మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై మోటారు వాహనాల చట్టం 1988 లోని సెక్షన్ 185 ప్రకారం కేసులను నమోదు చేసి వారికి జరిమానా లేదా జైలు శిక్ష విధించడం లేదా రెండు శిక్షలను విధించడానికి వీలు ఉంది. మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల కలిగే నష్టాలపై మంత్రిత్వ శాఖ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

జాతీయ రహదారుల అభివృద్ధి, జాతీయ రహదారుల వెంబడి ఉన్న ఆస్తులకు వెళ్ళడానికి వీలు కల్పించే అంశాలను మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తూ తగిన చర్యలను తీసుకుంటున్నది. జాతీయ రహదారుల రైట్ ఆఫ్ వే పరిధిలోకి రాని ఆస్తుల వినియోగం మరియు వాటిలో జరిగే వ్యాపారాలపై మంత్రిత్వ శాఖకు నియంత్రణ కలిగి లేదు. మద్యం దుకాణాల తొలగింపు అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశం అయినందున దీనిపై ప్రభుత్వం డేటాను సేకరించదు.

# సినిమా థియేటర్లలో టిక్కెట్లు ధరలపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్ , జులై 27:తెలంగాణలో సినిమా థియేటర్లలో టిక్కెట్లు ధరలపై హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర విభజన తర్వాత టికెట్ల ధరలను నిర్ణయించడానికి ఎటువంటి రూల్స్ ఫ్రేమ్ చేశారని హైకోర్టు ప్రశ్నించింది. టికెట్ల ధరలు నిర్ణయించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆ కమిటీ సూచనలు ప్రభుత్వానికి నివేదించినట్లు కోర్టుకు తెలిపారు. కమిటీ నివేదికపై నాలుగు వారాల్లో ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టుకు తెలపాలని హైకోర్టు స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ సినిమాటోగ్రఫీ, హోం శాఖ సెక్రెటరీలకు హైకోర్టు ఆదేశించింది.



# దేశంలో పరిశోధనకు అవసరమైన వ్యవస్థను బలోపేతం చేయడానికి నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్

న్యూఢిల్లీ, జులై 27:దేశంలో పరిశోధన వ్యవస్థను బలోపేతం చేయడానికి నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆర్అండ్‌డి, అకాడెమి మరియు పరిశ్రమల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు అవసరమైన సంస్థగా ఎన్ఆర్ఎఫ్ ప్రతిపాదించబడింది. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ యొక్క మొత్తం ప్రతిపాదిత వ్యయం ఐదేళ్ల కాలంలో రూ .50,000 కోట్లు.

విద్యాసంస్థలలో ముఖ్యంగా విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలలలో పరిశోధన సామర్థ్యం పెంపుతో పాటు పరిశోధనలను సులభతరం చేయడం ఎన్ఆర్ఎఫ్ యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటి. ఇది అధిక ప్రభావ, పెద్ద స్థాయి, బహుళ పరిశోధకుడు, బహుళ సంస్థ మరియు కొన్ని సందర్భాల్లో సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు మరియు ఇతర ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థల సహకారంతో ఇంటర్ డిసిప్లినరీ లేదా బహుళ దేశ ప్రాజెక్టులకు ముఖ్యంగా పరిశ్రమల్లో నిధులతో పాటు మద్దతు అందిస్తుంది.

34 సంవత్సరాల విరామం తరువాత 29-07-2020 న ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 (ఎన్ఇపి) ను ప్రకటించింది. ఈ విధానం విద్యా రంగంలో పరివర్తన మార్పులను తెస్తుంది. ఈ కార్యక్రమ ప్రధాన సిఫారసులలో ఒకటి విద్యలో ప్రాంతీయ భాషల వాడకాన్ని మరింతగా ప్రోత్సహించడం. ఈ విషయంలో, ప్రభుత్వం వీటితో సహా అనేక చర్యలు తీసుకుంది:

11 భాషలలో నిర్వహిస్తున్న వైద్య ప్రవేశ పరీక్ష నీట్ పరీక్ష ఇప్పుడు 13 భాషలలో నిర్వహించబడుతుంది.

3 భాషలలో నిర్వహిస్తున్న జెఈఈ (మెయిన్) ఇప్పుడు 13 భాషలలో నిర్వహించబడుతుంది.

పైలట్ ప్రాతిపదికన 2021-2022 అకాడెమిక్ సెషన్ నుండి కొన్ని ఏఐసిటిఈ ఆమోదించిన సంస్థలలో 8 ప్రాంతీయ భాషలలో సాంకేతిక విద్య అందిస్తారు.

సైన్స్, ఇంజనీరింగ్ ఒ టెక్నాలజీ, హ్యూమానిటీస్ ఒ సోషల్ సైన్సెస్, లా, మేనేజ్‌మెంట్ వంటి విభాగాలలో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్న స్వయం ప్లాట్‌ఫాం కింద ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ కోర్సుల కోసం రిఫరెన్స్ మెటీరియల్స్ అనువాదం.

ప్రాంతీయ భాషలలో నడుస్తున్న ప్రోగ్రామ్‌ల కోసం దరఖాస్తు చేయాలనుకునే సంస్థల కోసం ఏఐసిటీఈ హ్యాండ్‌బుక్ (హ్యాండ్‌బుక్ 2021-22).

గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆంగ్ల భాషా ఆన్‌లైన్ కోర్సులను హిందీ, బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళం, గుజరాతీ, కన్నడ, మలయాళం, పంజాబీ, అస్సామీ ఒ ఒడియా వంటి పదకొండు వేర్వేరు భాషల్లోకి అనువదించడానికి ఏఐసిటీఈ ట్రాన్స్‌లేషన్ ఆటోమేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ రూపొందించింది.

హిందీలో 1,000 పుస్తకాలను ప్రచురించడానికి హర్యానా ప్రభుత్వం మరియు ఎఐసిటిఈమధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ (ఎస్ఐపి) ఇప్పుడు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాంతీయ భాషలో పాఠ్యాంశాల్లో తప్పనిసరి భాగం,.

# సంగారెడ్డి నియోజక వర్గంలో రేషన్ కార్డులు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ..!

## - శాసనమండలి ప్రొటెం స్పీకర్ భూపాల్ రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి.

సంగారెడ్డి, జూలై 27 (నేటినిజం ప్రతినిధి) ప్రతి పేదవాడు మూడుపూటలా అన్నం తినాలన్న ఆశయంతో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు ఇస్తుందని శాసనమండలి ప్రొటెం స్పీకర్ భూపాల్ రెడ్డి అన్నారు.

మంగళవారం నాడు సంగారెడ్డి పట్టణం లోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులను ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఎవరు అలమటించకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. తెలంగాణ వచ్చాక ప్రజల కోసం ముఖ్యమంత్రి తీసుకున్న సంక్షేమ కార్యక్రమాలు అన్నీ నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, పేద వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు.

ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేరిట కోట్ల రూపాయల ఖర్చుతో పేద కుటుంబాల ఆడపిల్లల పెళ్లిళ్లు జరిపిస్తున్నదన్నారు.ఇది ప్రభుత్వం ఇస్తున్న భరోసా అని ఆయన పేర్కొన్నారు.

కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డు ద్వారా ఇంట్లో ఉన్న ఎంతమంది కైనా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యాన్ని ఇస్తున్నారని, నాణ్యత కలిగిన సరుకులను పంపిణీ చేస్తు ప్రభుత్వం పేదోడి ఆకలి తీరుస్తుందన్నారు.

గతంలో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలంటే తల్లిదండ్రులు ఎంతో కష్టాలు వాడేవారని, పేదింటి ఆడపిల్ల పెళ్ళికి ఏ విధంగా ఆదుకోవాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు శ్రీకారం చుట్టిందే షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలని అన్నారు. అర్హులైన పేదింటి ఆడపిల్ల పెళ్ళికి లక్ష నూట పదహారు రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే అమలు అవుతున్నాయని తెలిపారు.

సంగారెడ్డి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించడానికి బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసుకున్నామని, గోదావరి జలాలు సంగారెడ్డికి వస్తున్నాయని ఎంపీ వివరించారు. ప్రభుత్వం చాలా విషయాల్లో సంగారెడ్డి పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని అన్నారు. హైదరాబాద్ మాదిరిగా సంగారెడ్డి జిల్లా ను తీర్చి దిద్దడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.




సమాజంలో అందరూ సమానంగా ఉండాలని ,దళితులు ఆర్థికంగా అన్ని రంగాలలో ఎదగాలని ముఖ్యమంత్రి దళిత బంధు పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన వారికి కొత్తగా అందిస్తున్న రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

సంగారెడ్డి నియోజకవర్గంలోని సంగారెడ్డి ,సదాశివ్ పేట్, కొండాపూర్, కంది మండలాలకు చెందిన 396 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 1383 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్ పర్సన్ లత విజయేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపిటిసిలు, సర్పంచులు, రెవిన్యూ డివిజనల్ అధికారి, తహసిల్దార్, తదితరులు పాల్గొన్నారు.

# పనితీరు బాగోలేని అధికారులకు మెమోలు జారీ చేయాలి: జగన్

అమరావతి, జులై 27:ఏపీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు బాగోలేని అధికారులకు మెమో జారీచేయాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం జగన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారానికి నాలుగు సార్లు గ్రామ, వార్డు సచివాలయాలు సందర్శించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకుంటే సమస్యలు ఎలా తెలుస్తాయని అధికారులను సీఎం జగన్ ప్రశ్నించారు.

కలెక్టర్లు, జేసీల పనితీరు బాగుందని.. వారిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన అధికారులు కూడా పనిచేయాలని సీఎం జగన్ తెలిపారు. అధికారులకు మెమో ఇవ్వడమంటే.. ఒకరకంగా తన పనితీరుపై తానే మెమో ఇచ్చుకున్నట్లు అని జగన్ అభిప్రాయపడ్డారు.

100 శాతం గ్రామ, వార్డు సచివాలయాల్లో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పేదల గురించి ఆలోచించి అధికారులు మానవత్వం చూపించాలని సీఎం సూచించారు.

మరోవైపు ఆగస్టు 10న నేతన్న నేస్తం, ఆగస్టు 16న విద్యాకానుక అందజేస్తామని జగన్ ప్రకటన చేశారు.

రూ.20 వేల లోపు డిపాజిట్ చేసిన అగ్రిగోల్డ్ బాధితులకు ఆగస్టు 24న నగదు జమ చేస్తామని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈలు, స్పిన్నింగ్‌మిల్స్‌కు ఆగస్టు 27న ఇన్సెంటివ్‌లు ఇస్తామని, ఈ మేరకు కలెక్టర్లు సన్నద్ధంగా సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

# ఇనుము, ఉక్కు అందుబాటును పెంచేందుకు పలు చర్యలు తీసుకున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, జులై 27:ఉక్కు అనియంత్రిత రంగం. ఉత్పత్తి, ఎగుమతి/దిగుమతులకు సంబంధించిన అన్ని వాణిజ్య నిర్ణయాలనూ ఉక్కు కంపెనీలే తీసుకుంటాయి. అయితే, ఇనుము, ఉక్కు అందుబాటును పెంచేందుకు ప్రభుత్వం వివిధ చర్యలను తీసుకుంది. ముడి ఇనుము ఉత్పత్తి, అందుబాటులో ఉండేందుకు మైనింగు, ఖనిజ విధాన సంస్కరణలు, ఒడిషాలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంస్థలు జప్తు చేసిన పని చేసే గనులను త్వరితగతంగా నిర్వహించడంతో పాటుగా, ఉక్కు ఉత్పత్తిదారుల ఉత్పాదనను, సామర్థ్యాన్ని పెంచేందుకు పలు చర్యలను తీసుకుంది.

కేంద్ర బడ్జెట్ 2021-22లో మిశ్రధాతువులు, మిశ్రధాతువులు కాని, స్టెయిన్‌లెస్ స్టీల్‌కు చెందిన సెమిలు, చదునైన, పొడవైన ఉత్పత్తులపై సమానంగా కస్టమ్స్ డ్యూటీని 7.5% తగ్గించింది. అంతేకాక, స్టీల్ తుక్కుపై 31 మార్చి, 2022 వరకూ బిసిడికి మినహాయింపు ఇచ్చారు. ఇందుకు అదనంగా, కొన్ని స్టీలు ఉత్పత్తులపై ఎడిడి, సివిడలను ఉపసంహరించింది/ తాత్కాలికంగా ఉపసంహరించింది.

ఈ సమాచారాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి రామచంద్ర ప్రసాద్ సింగ్ సోమవారం లోక్‌సభకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు.

# సిఎస్ఆర్ లో భాగంగా 15 ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల విరాళం.!




సంగారెడ్డి,జూలై, 27 (నేటినిజం ప్రతినిధి) ఎల్ అండ్ టి డెక్కన్ టోల్వేస్ లిమిటెడ్ (ఎల్ అండ్ టి డిటిఎల్), ఎల్ అండ్ టిన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ యాజమాన్యం సిఎస్ఆర్ లో భాగంగా 15 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సంగారెడ్డి జిల్లాకు విరాళంగా అందజేశారు. మంగళవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజార్షి షా , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి శ్రీమతి గాయత్రి దేవి సమక్షంలో ప్రాజెక్ట్ హెడ్ (ఎల్ అండ్ టి డిటిఎల్-ఓ ఒ ఎమ్) మిస్టర్ రాజేష్ విచారే ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందించారు. సిఎస్ఆర్ ద్వారా మేనేజ్‌మెంట్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మద్దతు ఇచ్చిందని తెలిపారు.

# శ్రీరాంసాగర్ నుంచి 4వేల క్యూసెక్కుల నీళ్లు విడుదల

హైదరాబాద్ , జులై 27:శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 4వేల క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు. బుధవారం సాయంత్రానికిది 6వేల క్యూసెక్కులకు చేరుకుంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. వరి నాట్లు వేసేందుకు నీళ్లను విడుదల చేయాలన్న ఆయకట్టు రైతుల కోర్కెను మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. మంగళవారం రాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4వేల క్యూసెక్కుల నీళ్లను వదిలారు. బుధవారం సాయంత్రానికిది 6వేల క్యూసెక్కులకు చేరుకోనుంది. దీని వల్ల నిజామాబాద్ జిల్లాలోని కొంత భాగం, కోరుట్ల,మెట్ పల్లి, జగిత్యాల, కరీంనగర్,పెద్దపల్లి, చొప్పదండి, ధర్మపురి,మంథని తదితర నియోజకవర్గాలలోని పంట పొలాలకు సమృద్ధిగా నీళ్లందుతాయి. ఈ ఆయకట్టు కింది రైతులు వరి నాట్ల పనులను మరింత ముమ్మరం చేస్తారు. సకాలంలో నీళ్లను విడుదల చేయడం పట్ల మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రైతాంగం ముఖ్యమంత్రి కెసిఆర్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి కేటీఆర్ సాయం



హైదరాబాద్ , జులై 27:మంత్రి కేటీఆర్ మరోసారి తన మంచితనాన్ని చాటుకున్నారు. ఆపదలో వున్నవారికి సాయం చేయడం కంటే పెద్దపని ఏదీ లేదని భావించి బిజీ షెడ్యూల్ లోనూ ఇద్దరు యువకుల ప్రాణాలను కాపాడేందుకు తాపత్రయపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్ర శివారులో ఔటర్ బైపాస్ రోడ్డుపై, మెడికల్ కాలేజీకి సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో వారికి గాయాలయ్యాయి. ఈ సమయంలో అటువైపుగా రాష్ట్ర మంత్రి కేటీఆర్ కాన్వాయ్ వెళుతున్నది. జరిగిన ప్రమాదాన్ని చూడగానే కారు దిగారు. తన కాన్వాయ్‌లోని రెండు కార్లలో గాయపడిన ఆ ఇద్దరు క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. వారితోపాటు తన పీఏ మహేందర్‌రెడ్డి, ఎస్కార్ట్ పోలీసులను పంపించడమే కాదు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్ లో సూచించారు. ఆపదలో వున్నవారిని కాపాడి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు కేటీఆర్. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో వున్న తమవారిని కాపాడిన మంత్రి కేటీఆర్ కు క్షతగాత్రుల కుటుంబసభ్యులు, బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

# త్వరలో ఏపీలోని లేపాక్షికి యునెస్కో గుర్తింపు



అమరావతి, జులై 27:తెలుగు రాష్ట్రాల్లో మరో చారిత్రక కట్టడానికి యునెస్కో గుర్తింపు దక్కనుంది. ఇప్పటికే తెలంగాణలోని రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. త్వరలోనే అనంతపురం జిల్లాలోని ప్రఖ్యాత లేపాక్షి ఆలయానికి కూడా యునెస్కో గుర్తింపు లభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ఈ విషయాన్ని తెలిపినట్టు టీజీ వెంకటేశ్ నేతృత్వంలోని పర్యాటకం, సాంస్కృతిక శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం సోమవారం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. అలాగే, రాతియుగానికి చెందిన కేతవరం గుహలను కూడా ప్రపంచ వారసత్వ కేంద్రాల జాబితాలో చేర్చాలని యునెస్కోను కోరనున్నట్టు తెలుస్తోంది.

యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చేందుకు అర్హమైన కేంద్రాలు, నిర్మాణాలకు సంబంధించిన వివరాలను సిద్ధం చేయడంలో కేంద్రానికి సహాయం అందించాలంటూ ఆయా రాష్ట్రాలకు స్థాయీ సంఘం సిఫారసు చేసింది. అలాగే, ఏపీలో రూ.159 కోట్లతో 13 చోట్ల ప్రపంచస్థాయి మ్యూజియంలను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్టు స్థాయీ సంఘం తన నివేదికలో పేర్కొంది.

# బీజేపీ నుంచి టీఆర్ఎస్‌లోకి చేరికలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జులై 27: టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా కౌటాల మ0డల0లోని గురుడుపేట గ్రామానికి చెందిన 30 మంది బీజేపీ కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. టీఆర్ఎస్‌లోని ప్రతి కార్యకర్తకు సరైన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

# అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు : ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, జులై 27:: తెలంగాణ రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి తెలిపారు. జిల్లాలోని టేకుమట్ల, చిట్యాల మొగుళ్లపల్లి మండలంలో రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు.

కల్యాణ లక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తన మన బేధం లేకుండా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లా రెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ అయిలయ్య, మండల పార్టీ ప్రెసిడెంట్ కత్తి సంపత్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి రెడ్డి, స్థానిక సర్పంచ్ సరోత్తం రెడ్డి,ఎంపిటిసి ఆది రఘు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్‌బీఐలో 6,100 పోస్టుల భర్తీ.. సెలక్షన్ ప్రాసెస్ ఎలా ఉంటుంది?



న్యూఢిల్లీ, జులై 27:దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6,100 అప్రెంటీస్ పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా పోస్టులకు సంబంధించి తెలంగాణలో 125, ఏపీలో 100 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. అప్రెంటీస్ పోస్టులకు డిగ్రీ అర్హత కావడంతో లక్షల్లో అభ్యర్థులు అప్లై చేశారు. 2021 ఆగస్టులో ఎగ్జామ్ ఉంటుంది. మరి ఈ పోస్టులకు ఎస్‌బీఐ ఎలా ఎంపిక చేస్తుంది? సెలక్షన్ ఎలా ఉండబోతుంది?

అప్రెంటీస్ పోస్టులకు ఆన్‌లైన్ రాతపరీక్ష, టెస్ట్ ఆఫ్ లాంగ్వేజ్ నిర్వహించడం ద్వారా అధికారులు ఎంపిక చేయనున్నారు. రాత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. గంట సమయం ఉంటుంది. జనరల్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్‌పై 25 ప్రశ్నలకు 25 మార్కులు ఉంటాయి. సమయం 15 నిమిషాలు. జనరల్ ఇంగ్లీష్‌పై 25 ప్రశ్నలకు 25 మార్కులు ఉంటాయి. సమయం 15 నిమిషాలు. క్వాంటిటేటీవ్ యాప్టిట్యూడ్‌పై 25 ప్రశ్నలకు 25 మార్కులు ఉంటాయి. సమయం 15 నిమిషాలు. రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ యాప్టిట్యూడ్‌పై 25 ప్రశ్నలకు 25 మార్కులు ఉంటాయి. సమయం 15 నిమిషాలు.

ఆంధ్రప్రదేశ్‌లో చీరాల, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, తెలంగాణలో హైదరాబాద్, కరీంగనర్, ఖమ్మం, వరంగల్‌లో పరీక్షా కేంద్రాలు ఉంటాయి. రాతపరీక్షలో ప్రశ్నలు ఇంగ్లీష్, హిందీ భాషలో ఉంటాయి. నెగిటీవ్ మార్కింగ్ ఉంది. ప్రతీ తప్పు సమాధానానికి 1/4 మార్కు తగ్గిస్తారు. మినిమమ్ క్వాలిఫయింగ్ మార్కులను బ్యాంకు నిర్ణయిస్తుంది. రాష్ట్రాలు, కేటగిరీల వారీగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తుంది ఎస్‌బీఐ. ఇద్దరికీ సేమ్ కటాఫ్ మార్కులు వస్తే వయస్సు ఆధారంగా ఒకరిని ఎంపిక చేస్తారు. రాతపరీక్షలో ఎంపిక అయిన వారికి టెస్ట్ ఆఫ్ లోకల్ లాంగ్వేజ్ ఉంటుంది. స్థానిక భాషలో చదవడం, రాయడం, మాట్లాడటం, అర్థం చేసుకోవడం తెలిసి ఉండాలి. ఈ పరీక్షలో క్వాలిఫై అయితేనే అప్రెంటీస్ పోస్టుకు అర్హులు. టెన్త్ లేదా ఇంటర్‌లో స్థానిక భాషలో చదివినవారికి లాంగ్వేజ్ టెస్ట్ ఉండదు. రాతపరీక్ష, టెస్ట్ ఆఫ్ లాంగ్వేజ్‌తో పాటు మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. ఆ తర్వాతే ఫైనల్ ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

# వివేకా కేసులో కదులుతున్న డొంక.. విచారణకు హాజరైన అనుమానితులు

అమరావతి, జులై 27:ఏపీ సీఎం వైఎస్ జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) వేగవంతం చేసింది. కడప కేంద్ర కారాగారంలోని అతిథి గృహంలో 51వ రోజు విచారణ కొనసాగిస్తోంది. మంగళవారం సీబీఐ అధికారులు ముగ్గురు అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. పులివెందులకు చెందిన ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రకాశ్ తో పాటు తిరుపతికి చెందిన డాక్టర్ సతీశ్ కుమార్ రెడ్డి కూడా విచారణకు హాజరయ్యారు.

గత కొన్ని రోజులుగా కడప కేంద్ర కారాగారంలోని అతిథి గృహంలోనే సీబీఐ అధికారులు అనుమానితులను ప్రశ్నిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో మరిన్ని వివరాలను రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇటీవల పర్యవేక్షణ అధికారిని మారుస్తూ సీబీఐ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ కేసు డీఐజీ సుధాసింగ్ నుంచి ఎస్పీ రామ్‌కుమార్‌కు బదిలీ అయింది. మరోవైపు ఈ కేసులో వాచ్ మెన్ రంగయ్య ఇచ్చిన కీలకం మారింది.

కేసును విచారించేందుకు కొత్తగా సీబీఐ విభాగంలోని ఐజీ స్థాయి అధికారి రామ్ కుమార్ ఇప్పటికే కడపకు చేరుకున్నారు. మొన్నటి వరకు డీఐజీ సుధాసింగ్ 49 రోజులపాటుగా కేసులోని అనుమానితులను విచారించారు. వాచ్?మెన్? రంగన్న రెండు రోజుల కిందట కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. అంతకంటే ఒకరోజు ముందే సీబీఐ డీఐజీ సుధాసింగ్?ను తిరిగి విజయవాడకు పంపించారు. ఆమె స్థానంలోనే తాజాగా రామ్? కుమార్?ను నియమించారు. రంగన్న వాంగ్మూలాన్ని కీలక పరిణామంగా భావిస్తున్న సమయంలో.. కొత్త అధికారి రావటం ఆసక్తిని రేపుతోంది. మరోవైపు రేపట్నుంచే కేసులోని కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. సుధాసింగ్ నేతృత్వంలోనే విచారణ కనసాగనుంది.

కొద్దిరోజుల కిందట మాజీ మంత్రి వైఎస్? వివేకా హత్యకేసు దర్యాప్తు చేస్తున్న పర్యవేక్షణ అధికారిని ఉన్నతాధికారులు మార్చారు. సీబీఐలో డీఐజీ ర్యాంకు హోదాలో దాదాపు ఏడాది నుంచి వివేకా హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సుధాసింగ్?ను తప్పించారు. ఇప్పటికే కేసులో పలువురు కీలక అనుమానితులను కడప కేంద్ర కారాగారం అతిథి గృహానికి పిలిపించి విచారించారు. ఈ దర్యాప్తు విచారణకు ఆమెనే నేతృత్వం వహించారు.

మరోవైపు ఈ కేసులో 23వ తేదీన 11 నుంచి 12 గంటల మధ్యలో జమ్మలమడుగు మెజిస్ట్రేట్ ముందు రంగన్న వాంగ్మూలం నమోదు చేశారు. మెజిస్ట్రేట్ ఫక్రుద్దీన్ సెక్షన్ 164 కింద రంగన్న వాంగ్మూలం నమోదు చేశారు. వాంగ్మూలం నమోదు చేసే సమయంలో మెజిస్ట్రేట్? రంగన్న మినహా మిగిలిన వారెవ్వరూ లేకుండా చూసుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత రంగన్నను సీబీఐ అధికారులు కడపకు తీసుకొచ్చారు. తాజాగా సీబీఐ విభాగంలోని ఐజీ స్థాయి అధికారి రంగంలోకి దిగటంతో ఆసక్తిని రేపుతోంది.

# షర్మిల దీక్షకు కోమటిరెడ్డి మద్దతు!



అమరావతి, జులై 27:తెలంగాణ రాజకీయాల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఏం చేసినా అంది సంచలనమే. టీ.పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నియామకం తర్వాత కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్న కోమటిరెడ్డి బ్రదర్స్.. తమ తదుపరి రాజకీయ కార్యచరణ ఏమిటి ? అన్నది సస్పెన్స్ లో పెట్టారు. తాను గాంధీ భవన్ మెట్లు ఎక్కనని శపథం చేసిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి? తన నియోజకవర్గానికే పరిమితం అయ్యారు. ఇక బీజేపీలో గోడ దూకేదామనుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. మళ్లీ యాక్టివ్ అవుతున్నారు. అయితే, కోమటిరెడ్డి బ్రదర్స్ చూపు ఇప్పుడు షర్మిల స్థాపించిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ వైపు మళ్లింది. జులై 8న వైఎస్ఆర్టీపీ ప్రకటన సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి షర్మిలకు అభినందనుల తెలిపారు. అంతేకాదు వైఎస్ కు నివాళిగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. తాజాగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కూడా షర్మిలకు జై కొట్టారు.

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. చండూరు మండలం, పుల్లెంల గ్రామంలో వైఎస్సార్ తెలంగాణపార్టీ అధ్యక్షురాలు షర్మిల చేపట్టిన నిరుద్యోగ నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటించి ఆశ్చర్యపరిచారు. తాను ఢిల్లీలో ఉన్నందున ఫోన్ చేస్తున్నానని.. లేదంటే స్వయంగా వచ్చి మద్దతు ప్రకటించేవాడనని చెప్పారు. రాజన్న బిడ్డగా తమ నియోజకవర్గంలో అడుగుపెట్టడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారని, ఆ సమస్యపై పోరాటం చేయడం స్వాగతిస్తున్నట్టు? చెప్పారు. వైఎస్సార్ అంటే తమకు ప్రాణమని.. ఆయన ఎప్పటికీ తమ గుండెల్లో ఉంటారని చెప్పారు. మునుగోడు ప్రజలకు వైఎస్సార్ ఉదయ సముద్రం ప్రాజెక్టు కట్టించారని.. ఆ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు నీరందించొచ్చని చెప్పారు. వైఎస్సార్ 90శాతం ప్రాజెక్టు పూర్తి చేస్తే .. కేసీఆర్ ఏడేండ్లలో 10శాతం కూడా కంప్లీట్ చేయలేదని కోమటిరెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తయితే వైఎస్సార్ కు, తమకు మంచి పేరు వస్తుందని పనులు పూర్తి చేయడం లేదని విమర్శించారు. మునుగోడులో వైఎస్సార్‌కు ఎంతో మంది అభిమానులు ఉన్నారని చెప్పుకొచ్చారు.

కోమరెడ్డి బ్రదర్స్ వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్ లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ మరో పార్టీకి మద్దతు ప్రకటించడంపై హస్తం నేతలు మండిపడుతున్నారు. సంచలనాలు సృష్టించడంలో కోమటిరెడ్డి బ్రదర్స్ ముందుంటారు. తమ మాటలతో, చేతలతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఇప్పుడు కూడా ఈ ఇద్దరు అన్నదమ్ములు షర్మిలకు మద్దతు ప్రకటించడం వెనుక రాజకీయ కారణం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. రేవంత్ కు పీసీసీ ఇవ్వడంతో కోమటిరెడ్డి బ్రదర్స్ ఇంకా అసంతృప్తిలోనే ఉన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఏ కార్యక్రమంలోనూ పాల్గొన లేదు. తమ పని తాము చుసుకుంటున్నారు. షర్మిల పార్టీకి ఇంకా గ్రౌండ్ లెవల్ లో రెడీ కాలేదు. ఆమె చేస్తున్న దీక్షలకు పెద్దగా స్పందన రావడం లేదని అభిప్రాయం వ్యక్తం అవు తోంది. అంతే, కాదు అధికార పార్టీ నేతలు సైతం ఆమెను పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవు. ఈ క్రమంలో కోమటిరెడ్డి బ్రదర్స్ షర్మిలకు మద్దతుగా ఉండడం ఆసక్తి రేపుతోంది.

# ఆలయాల భూములు ఖాళీగా ఉంచొద్దు: టీటీడీ ఈఓ



తిరుపతి, జులై 27:టీటీడీ ఆలయాలకు చెందిన వ్యవసాయ భూములను ఖాళీగా ఉంచొద్దని టీటీడీ ఈఓ జవహర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఆలయాల కార్యకలాపాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "అప్పలాయగుంట, శ్రీనివాసమంగాపురం ఆలయాల్లో కళ్యాణ కట్టలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు."టిటిడి అనుబంధ, విలీన ఆలయాలకు చెందిన వ్యవసాయ భూములను ఎప్పటికప్పుడు లీజుకు ఇచ్చే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రైతులతో సంప్రదించి సేంద్రియ ఎరువులతో పంటలు పండించి వాటిని తిరుమల ఆలయంలో ప్రసాదాల తయారీకి అందించేలా చూడాలని ఈఓ ఆదేశించారు. ఆలయాలకు కానుకగా వచ్చే గోవుల సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేసి వాటి ద్వారా వచ్చే పాలను గో సంరక్షణ శాలకు చేరవేసేలా ఏర్పాట్లు చేయాలని" పేర్కొన్నారు. విలీన ఆలయాలలో ఆదాయం, ఖర్చుకు వ్యత్యాసం లేకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. ఆలయాల అవసరాల ను బట్టి ఎంత మంది ఉద్యోగులు ఉండాలో ఎఫ్ఏ అండ్ సిఏఓతో సంప్రదించి నిబంధనలు తయారు చేయాలన్నారు. ఆలయాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనవసరంగా కొత్త భవనాలు కట్టకుండా ఉన్నవి వినియోగించుకోవాలన్నారు. స్థానిక ఆలయాలు, విలీన ఆలయాలకు సంబంధించి మంజూరు చేసిన అభివృద్ధి పనుల వివరాలు డెప్యూటీ ఈవోలకు తెలియచేయాలన్నారు. మంజూరైన అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఆలయాల ఆదాయం, భక్తుల సంఖ్యను బట్టి గ్రేడ్‌లుగా విభజించాలన్నారు. తిరుమల ఘాట్‌రోడ్‌లోని వినాయక ఆలయంలోని సిమెంట్ విగ్రహం స్థానంలో రాతి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం చుట్టూ పూల మొక్కలు పెంచి భక్తులకు ఆహ్లాద వాతావరణం కల్పించాలని టీటీడీ ఈఓ అధికారులను ఆదేశించారు.

# ఏపీ గవర్నర్ గా యడియూరప్ప రావడం దాదాపు ఖాయమేనా..?



కర్ణాటక,జులై 27: కర్ణాటక సీఎం పదవికి రాజీనామా చేసిన యడియూరప్ప ఆ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం నమోదు చేశారు. అయితే యడియూరప్ప తదుపరి కార్యచరణపై అందరి దృష్టి పడింది. అయితే యడియూరప్ప ఏపీకి గవర్నర్ గా రానున్నాడని ఊహగానాలు మొదలయ్యాయి. యడియూరప్ప సీఎం పదవికి రాజీనామా చేయకుముందు నుంచే ఏపీకి గవర్నర్ గా రానున్నడని వార్తలు వెలువడ్డాయి..తన రాజీనామా అంశాన్ని ఖండిస్తూనే వచ్చిన యడియూరప్ప చివరకు రాజీనామా చేశారు.. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను కలిసిన ఆయన రాజీనామా పత్రాన్ని అందజేశారు. అయితే, కొత్త సీఎంను ఎన్నుకునే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని యడియూరప్పను కోరారు గవర్నర్.. ఇక, యడియూరప్ప వారసుడు ఎవరు? కర్ణాటక సీఎం పీఠంపై కూర్చోబోతున్న కొత్త వ్యక్తి ఎవరు అనేదానిపై బీజేపీ అధిష్టానం తీవ్రమైన కసరత్తు చేస్తోంది.. ఇదే సమయంలో.. యడియూరప్పకు బీజేపీ అధిష్టానం గవర్నర్ పదవి ఆశచూపినట్టు కూడా ప్రచారం సాగుతోంది.. ఏపీ లేదా మరో రాష్ట్రానికి గవర్నర్ గా యడియూరప్పను నియమించే అవకాశాలు ఉన్నాయని సమాచారం..

ఇప్పటికే కేంద్ర కేబినెట్ నుంచి తప్పించి మరీ గవర్నర్ నియమించిన ఘటనలు ఉన్నాయి.. వివిధ రాష్ట్రాల్లోనూ పార్టీ సీనియర్లకు కూడా గవర్నర్లను చేసింది బీజేపీ అధిష్టానం.. అదే కోవలో.. యడియూరప్పను కూడా గవర్నర్‌గా పంపే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.. అయితే, దీనిపై స్పందించిన యడియూరప్ప.. తాను ఎక్కడికీ వెళ్లనని, రాష్ట్రంలోనే ఉంటానని స్పష్టం చేశారు. మరోవైపు.. తన రాజీనామాపై హైకమాండ్ నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని కూడా చెప్పుకొచ్చారు.. తాను ఎలాంటి పదవులూ కోరుకోవడం లేదని, గవర్నర్ గా వెళ్లడం ఇష్టం లేదని తెలిపారు.. మరీ ఈ కర్ణాటక ఎపిసోడ్‌కు ఎప్పుడు తెరపడుతుంది.. యడియూరప్పను ఎలాంటి పదవి వరించబోతోంది? అనేది వేచిచూడాలి.

# డబుల్’ ఇండ్ల నిర్మాణం పనుల్లో వేగం పెంచాలి



వికారాబాద్, జులై 27: ధారూరు మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను ప్రజా ప్రతి నిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో స్పీడ్ పెంచాలన్నారు. నిర్మాణంలో నాణ్యత ఎక్కడ కూడా లోపించకుండా కాంట్రాక్టర్లు జాగ్రత వహించాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించే విధంగా అధికారులు తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి, జడ్పీటీసి కోస్నం సుజాత, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, తహసీల్దార్ భీమయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ ఆదర్శం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జులై 27: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ సర్కార్ దేశానికే ఆదర్శం అని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. జిల్లాలోని కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో కొత్త రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి పథకాల చెక్కులను పంపిణీ చేశారు. కౌటాల మండలంలో 91 కొత్త రేషన్ కార్డ్ లు మొదటి విడత గా మంజూరు కావడం అభినందనీయమన్నారు. కల్యాణ పథకం ఆడబిడ్డ పెండ్లికి ఆర్థికంగా ఆదుకుంటున్నదన్నారు. ఈ సందర్భంగా 57 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందించారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో నియంతృత్వం రాజ్యమేలుతోంది: మల్లిఖార్జున ఖర్గే

న్యూఢిల్లీ, జులై 27: దేశంలో నియంతృత్వం రాజ్యమేలుతున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. ఐటీ చట్టం ప్రకారం ప్రభుత్వం ఎవరిపై నిఘా వేయాలన్నా ముందస్తు అనుమతి అవసరమని, కానీ మోదీ ప్రభుత్వం ఎలాంటి అనుమతి లేకుండా పెగాసస్ స్పైవేర్‌తో న్యాయమూర్తులు, ఆర్మీ అధికారులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులపై నిఘా వేసిందని ఆయన ఆరోపించారు. ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశం ఇలాంటి చర్యకు పూనుకోదని ఖర్గే విమర్శించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించే ఉద్దేశం ప్రధాని నరేంద్రమోదీకి లేదని, అందుకు ఆయన ఏమాత్రం సిద్ధంగా లేరని మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. మేం ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం వెంటనే ఆల్‌పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే పెగాసస్ విషయంలో తామంతా (ప్రతిపక్షాలు) కలిసి ఉమ్మడిగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# వైద్యులకు, ఆరోగ్య కార్యకర్తలకు పద్మ అవార్డులు : ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ, జులై 27:ప్రతిష్టాత్మక పద్మ అవార్డుల కోసం ఈ ఏడాది వైద్యులు, ఆరోగ్య కార్యకర్తల పేర్లు పంపాలని నిర్ణయించినట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం తెలిపారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తల సేవలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఈ మేరకు వారిని గౌరవించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పేర్లను ప్రతిపాదించాలని ప్రజలను కోరారు. ఆగస్ట్ 15వ తేదీలోగా అవార్డులకు పేర్లను జూజీటఎజీజీలిజీటీటబ.టవశ్రీప్రతిఏణఎజీతిశ్రీ.ఇనీఎ మెయిల్ చేయాలని సూచించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీ.. పేర్లను పరిశీలించి తుది జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్లు చెప్పారు. పద్మ అవార్డులు (పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ) నామినేషన్లు, సిఫారసులను సెప్టెంబర్ 15 వరకు పంపాలని కేంద్రం సూచించింది. ఇంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ సైతం అవార్డుల కోసం నామినేట్ చేయాలని ప్రజలను కోరారు.

పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు దేశంలో అత్యున్నత పౌర పురస్కారాలు. 1954లో పద్మ అవార్డులను స్థాపించారు. ఈ అవార్డులు ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తారు. ఈ అవార్డు 'వర్క్ ఆఫ్ డిస్టింక్షన్' ను గుర్తించటానికి ప్రయత్నిస్తుంది. కళలు, సాహిత్యం, విద్య, ఆటలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ వంటి అన్ని రంగాల్లో విశిష్టమైన, అసాధారణమైన విజయాలు, సేవలకు ఈ అవార్డు ఇవ్వనున్నారు. కాగా.. వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా పీఎస్‌యూలతో పనిచేసే వారితో సహా ప్రభుత్వ ఉద్యోగులు పద్మ అవార్డులకు అర్హులు కాదు.

# కోవిడ్ వాక్సినేషన్ డోస్‌లను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ముందస్తు కేటాయింపుల ప్రకారం నెలమొత్తానికి వివిధ షెడ్యూళ్లలో కేటాయింపు

న్యూఢిల్లీ, జులై 27:కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో భారత ప్రభుత్వం ముందుంది. కోవిడ్ పై పోరాటంలో భారత దేశం పెద్ద ఎత్తున పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ, కోవిడ్ వ్యాప్తి నిరోధక ముందస్తు జాగ్రత్త చర్యలతో పాటు అనుసరిస్తున్న ఐదు పాయింట్ల వ్యూహంలో వాక్సినేషన్ ముందు వరుసలో ఉంది.

జూలై 2021 నాటికి అర బిలియన్ డోస్‌లను వేయాలన్న లక్ష్యాన్ని ఇండియా చేరుకోలేకపోవచ్చని ఇటీవల కొన్ని మీడియా కథనాలు వచ్చాయి. జూలై 2021 నాటికి 516 మిలియన్ డోస్‌లు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెప్పినట్టు కూడా అందులో పేర్కొన్నారు. ఈ సమాచారం సరైనది కాదు. వాస్తవదూరమైనది..

516 మిలియన్ డోస్‌ల వాక్సిన్ కు సంబంధించిన సమాచారాన్ని వివిధ సోర్సుల ద్వారా తీసుకుని ఉంటారు.అది 2021 జనవరి నుంచి 2021 జులై వరకు అందుబాటులో ఉండదగ్గ వాక్సిన్ డోస్‌లకు సంబంధించినది. వాస్తవం ఏమంటే 2021 జనవరి నుంచి 2021 జులై 31 వరకు మొత్తం 516 మిలియన్లకు పైగా వాక్సిన్ డోస్‌లు సరఫరా చేయడం జరుగుతోంది.

ఇక్కడ చెప్పుకోదగిన ఇంకో ముఖ్య విషయం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వాటి ముందస్తు కేటాయింపుల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు వాటిని సరఫరా చేయడం జరుగుతున్నది. నెల పొడవునా ఆయా షెడ్యూళ్ల ప్రకారం వాటిని పంపిణీ చేయడం జరుగుతున్నది. 516 మిలియన్ డోస్‌లు నిర్దేశిత నెలాఖరుకు అందుబాటు లో ఉంటాయని అంటే, ఆ నెల వరకు సరఫరా చేసిన డోస్‌లు పూర్తిగా వాడినట్టు కాదు. కొన్ని సరఫరాలు పంపిణీ వివిధ దశలలో ఉ ండవచ్చు. అవి రాగల కొద్దిరోజులపాటు వాడకానికి పనికి వస్తాయి. అంటే ప్రత్యేకించి ఆ రాష్ట్రం, జిల్లా, సబ్ జిల్లాలో వాక్సినేషన్ ప్రక్రియ కొనసాగడానికి ఇది పనికి వస్తుంది.

ఇవాళ్టివరకు మొత్తం 457 మిలియన్ డోస్‌లు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 2021 జనవరి నుంచి ఇప్పటివరకు సరఫరా చేయడం జరిగింది. అదనంగా 60.3 మిలియన్ డోస్‌లు 31 జూలై నాటికి సరఫరా చేయడం జరుగుతుంది. దీనితో 2021 జనవరి నుంచి 2021 జూలై 31 వరకు మొత్తం 517 మిలియన్ డోస్‌లు సరఫరా చేస్తున్నట్టు అవుతుంది.

ఇండియా 440 మిలియన్ల (44.19 కోట్ల ) డోసులు వేసిన ఘనత సాధించింది. ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున వాక్సినేషన్ కార్యక్రమం ఎక్కడా జరగలేదు. అది కూడా ఎంతో వేగంగా జరిగింది. ఇందులో 9.60 కోట్ల మంది రెండు డోస్‌లూ వేయించుకున్న వారు ఉన్నారు.జూన్ 2021 లో మొత్తం 11.97 కోట్ల డోస్‌లు వేయడం జరిగింది. అలాగే 2021 జూలై లో అంటే 26 జూలై నాటికి మొత్తం 10.62 కోట్ల డోస్‌లు వేయడం జరిగింది.దేశంలోని ప్రతిఒక్క అర్హుడైన పౌరుడికి వీలైనంత త్వరగా కోవిడ్ వాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తున్నది.

# భారతీయ పనోరమా ఎంట్రీలకు చివరి తేదీ దగ్గర పడుతోంది

న్యూఢిల్లీ, జులై 27:ఎంట్రీల ముగింపు తేదీ దగ్గర పడుతుండగా, 52 వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) ఇండియన్ పనోరమా, 2021 కోసం ఎంట్రీల కోసం తన పిలుపును పునరుద్ఘాటించింది - ఐఎఫ్ఎఫ్ఐ యొక్క ప్రధాన భాగం, దీని కింద సమకాలీన భారతీయ చిత్రాలలో ఉత్తమమైనవి ఫిల్మ్ ఆర్ట్ ప్రమోషన్ కోసం ఎంపిక చేయబడ్డాయి .

ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 2021 ఆగస్టు 12, మరియు ఆన్‌లైన్ సమర్పించిన దరఖాస్తు యొక్క హార్డ్ కాపీని స్వీకరించడానికి చివరి తేదీ, ఇతర అవసరమైన పత్రాలతో పాటు 2021 ఆగస్టు 23, మార్గదర్శకాల సమితిని అనుసరించాలి. 2021 ఇండియన్ పనోరమా కోసం సినిమాలు సమర్పించడం. సిబిఎఫ్‌సి తేదీ లేదా సమర్పించిన చిత్రం యొక్క ఉత్పత్తి పూర్తయిన పండుగకు ముందు చివరి 12 నెలల్లో ఉండాలి, అనగా 2020 ఆగస్టు 1 నుండి 2021 జూలై 31 వరకు ఉండాలి. సిబిఎఫ్‌సి ధృవీకరించని మరియు ఈ వ్యవధిలో నిర్మించిన చిత్రాలను కూడా సమర్పించవచ్చు. అన్ని సినిమాలు తప్పనిసరిగా ఇంగ్లీష్ ఉపశీర్షికలను కలిగి ఉండాలి.

భారతీయ చిత్రాల ద్వారా భారతీయ చలనచిత్రాలు మరియు భారతదేశ సంస్కృతి వారసత్వాలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో 1978 లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో భాగంగా భారతీయ పనోరమాను ప్రవేశపెట్టారు. అప్పటి నుండి భారతీయ పనోరమా సంవత్సర కాలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఉత్తమ భారతీయ చిత్రాలను ప్రదర్శించడానికి ఉత్తమ వేదికగా మారింది.

అత్యుత్తమ కథ, నైపుణ్యంతో ఆకట్టుకునే విధంగా నిర్మించిన చలన చిత్రాలను ఎంపిక చేయడానికి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ప్రతి ఏడాది ఇండియన్ పనోరమను నిర్వహిస్తోంది. దీనిలో ఎంపిక చేసిన చిత్రాలను లాభాపేక్ష లేకుండా భారతదేశం మరియు విదేశాలలో జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు, ద్వైపాక్షిక సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు,విదేశాల్లో ప్రత్యేకంగా నిర్వహించే భారతీయ చలన చిత్రోత్సవాలు మరియు దేశంలో నిర్వహించే చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శిస్తారు.

# హింసాకాండలో దెబ్బతిన్న మహిళలకోసం హెల్ప్.లైన్!



న్యూఢిల్లీ, జులై 27: మహిళల రక్షణ, భద్రత లక్ష్యంగా ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబరు (7827170170)ను కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి జుబిన్ ఇరానీ ఈ రోజు వర్చువల్ పద్ధతిలో ఆవిష్కరించారు. నిర్విరామంగా 24గంటలూ పనిచేసే ఈ హెల్ప్ లైన్.ను జాతీయ మహిళా కమిషన్ (ఎన్.సి.డబ్ల్యు) ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా మహిళల రక్షణను, భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో, మహిళాభ్యున్నతికి సంపూర్ణంగా కృషిచేయాలన్న కేంద్ర ప్రభుత్వ ధ్యేయానికి అనుగుణంగా హెల్ప్.లైన్ రూపొందింది. అలర్లు, హింసాకాండలో దెబ్బతిన్న బాధిత మహిళలకు ఆన్.లైన్ ద్వారా సహాయం అందించేందుకు, వారికి అండగా నిలిచేందుకు ఈ హెల్ప్.లైన్ ఏర్పాటైంది. పోలీసు యంత్రాంగం, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, మనస్తత్వ సేవలు తదితర సదుపాయాలతో ఈ నంబరును అనుసంధానం చేయడం ద్వారా బాధిత మహిళలకు భద్రత కల్పించనున్నారు.

హెల్ప్.లైన్.ను ప్రారంభించిన సందర్భంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ, ఈ విషయంలో జాతీయ మహిళా కమిషన్ తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. కొత్త హెల్ప్.లైన్ పై ఆమె ప్రశంసలు కురిపించారు. మహిళలకు ఏదైనా అవసరం తలెత్తినపుడు తమ ప్రభుత్వం, తమ కమిషన్ అండగా నిలుస్తుందన్న సందేశాన్ని ఈ డిజిటల్ హెల్ప్ లైన్ అందిస్తోందని అన్నారు. మహిళలకు సహాయం అందించేందుకు హెల్ప్.లైన్ ఏర్పాటు చేయడంలో జాతీయ మహిళా కమిషన్ బృందం చేసిన కృషి "అద్భుతమ"ని, ప్రత్యేకించి వైరస్ మహమ్మారి వ్యాప్తి చెందుతున్న సంక్షోభ సమయంలో ఇలాంటి కృషి జరగడం అభినందనీయమని కేంద్రమంత్రి అన్నారు. బాధల్లో ఉన్న మహిళల కడగండ్లు తీర్చే కృషిలో జాతీయ మహిళా కమిషన్, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం నిరాటంకంగా ఎప్పటికీ కొనసాగగలదని ఆమె అన్నారు.

ఆవిష్కరణ కార్యక్రమంలో జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖా శర్మ మాట్లాడుతూ, ఈ హెల్ప్.లైన్ ఏర్పాటుతో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలోని ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మరింత బలోపేతమైందని, అవసరాల్లోని బాధిత మహిళలకు సకాలంలో అండగా నిలిచేందుకు, కౌన్సెలింగ్ సేవలందించేందుకు హెల్ప్.లైన్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. "మహిళల అభ్యున్నతికోసం నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాకు ఎల్లపుడూ స్ఫూర్తిదాయకమే. మహిళా సాధికారతనుంచి, మహిళల సారథ్యంలోని సాధికారత వరకూ, సమర్థవంతమైన ప్రధాని నాయకత్వంలో అనేక మార్పులను మేం చూడగలుగుతున్నాం, మరింత మెరుగ్గా పనిచేసేందుకు ఆయన నాయకత్వమే మాకు స్ఫూర్తిగా నిలుస్తోంది." అని రేఖా శర్మ అన్నారు.

పోలీసులు, ఆసుపత్రులు, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థలు, మనస్తత్వ సేవలు తదితర వ్యవస్థలతో, అధికార యంత్రాగాలతో అనుసంధానం ఏర్పరుస్తూ, ఇబ్బందుల్లో ఉన్న బాధిత మహిళలకు తగిన సహాయం, కౌన్సెలింగ్ సేవలందించడమే లక్ష్యంగా ఈ హెల్ప్.లైన్.ను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా మహిళలకు సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం అందించడం కూడా ఈ హెల్ప్.లైన్ లక్ష్యం. నిపుణుల బృందంతో ఈ హెల్ప్.లైన్ పనిచేస్తుంది. 18 సవంత్సరాలు, అంతకు మించిన వయస్సున్న మహిళలు నేరుగా ఈ హెల్ప్.లైన్ నంబరుకు ఫోన్ చేసి తమకు కావలసిన సహాయం కోరవచ్చు. న్యూఢిల్లీలోని జాతీయ మహిళా కమిషన్ ఆవరణనుంచి ఈ హెల్ప్.లైన్ 24గంటలూ పనిచేస్తుంది.

దేశవ్యాప్తంగా ఉన్న హింసాకాండతో దెబ్బతిన్న తిన్న మహిళల ఫిర్యాదులను, హక్కులకు నోచుకోని మహిళల సమస్యలను జాతీయ మహిళా కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలతో పరిశీలిస్తూ, పరిష్కరిస్తూ వస్తోంది. ఈ ఫిర్యాదులు లిఖిత పూర్వకంగా, లేదా ఆన్ లైన్ (లిలిలి.నిఇలి.నితిఇ.తిని) ద్వారా కమిషన్ దృష్టికి వస్తాయి. తమకు అందిన ఫిర్యాదులను కమిషన్ సముచితంగా పరిష్కరించి, బాధిత మహిళలకు తగిన ఉపశమనం కలిగిస్తుంది. ఫిర్యాదుల పరిష్కార వేదికను మరింత విస్తరింపజేసి, బలోపేతం చేసే లక్ష్యంతోనే కమిషన్ కొత్తగా ఈ డిజిటల్ హెల్ప్.లైన్ ను రూపొందించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ సహకారంతో ఈ హెల్ప్.లైన్ సేవలకు రూపకల్పన చేశారు. మహిళల రక్షణ, భద్రతకే జాతీయ మహిళా కమిషన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. హింసాకాండతో బాధితులైన మహిళలకు అవసరమైన పోలీసు సేవలు, మనస్తత్వ సామాజిక కౌన్సెలింగ్ సేవలు వంటివాటిని ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న ఉద్దేశంతో కొత్త హెల్ప్.లైన్ ఏర్పాటు కోసం జాతీయ మహిళా కమిషన్ చొరవ చూపింది.

కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా వర్చువల్ పద్ధతిలో జరిగిన ఈ హెల్ప్.లైన్ ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి ఇందీవర్ పాండే, జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖా శర్మ పాల్గొన్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యులు, డిజిటల్ ఇండియా కార్పొరేషన్ పరిశోధనా విభాగం సీనియర్ డైరెక్టర్ వినయ్ ఠాకూర్ సమక్షంలో కార్యక్రమం జరిగింది.

# పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్, జులై 27: జిల్లాలో వర్షంతో దెబ్బతిన్న చోట్ల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి. అలాగే నష్టం అంచనాలు త్వరగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు జరిగిన నష్టాన్ని త్వరగా అంచనా వేయలన్నారు. అలాగే దెబ్బతిన్న రోడ్లకు వంతెనలకు సంబంధించి పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని సూచించారు.

వాటికి కావాల్సిన బడ్జెట్ నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పంట నష్టానికి సంబంధించి నివేదికలు వెంటనే సమర్పించాలని తెలిపారు. గత మూడు రోజుల క్రితం కురిసిన ఈ పరిశీలన ఆధారంగా చేసుకుని భవిష్యత్తులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ రావు, ఇరిగేషన్ ఈఈ గుణవంత రావు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలహాసన్ రెడ్డి బదిలీ

హైదరాబాద్ , జులై 27: కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలహాసన్ రెడ్డి బదిలీ అయ్యారు.

ఈ మేరకు ఆయనను బదిలీ చేస్తూ ఇవాళ పోలీసుశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా కమలహాసన్ రెడ్డిని ఆదేశించింది. ఆయన స్థానంలో రామగుండం సీపీగా పనిచేస్తున్న సత్యనారాయణ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్‌గా రమణకుమార్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.

# ఔషధ మొక్కల సంరక్షణ, అభివృద్ధి ప్రాంతాల స్థితి

న్యూఢిల్లీ, జులై 27:ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే జాతీయ ఔషధ మొక్కల బోర్డు (ఎన్ఎంపీబీ), "ఔషధ మొక్కల సంరక్షణ, అభివృద్ధి, సుస్థిర నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ రంగ పథకాన్ని" 2014-15 నుంచి అమలు చేస్తోంది. ఈ పథకం కింద, 24 రకాల 'ఔషధ మొక్కల సంరక్షణ, అభివృద్ధి ప్రాంతాలను' (ఎంపీసీడీఏలు) ఏడు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాజెక్టు ఆధారిత సాయాన్ని ఎన్ఎంపీబీ అందించింది. ఇందుకోసం 940 లక్షల రూపాయలను కేటాయించి, 635.99 లక్షల రూపాయలు విడుదల చేసింది.

సహజ ఆవాసాల్లో పెరిగే ఔషధ మొక్కలను సంరక్షించడమే 'ఔషధ మొక్కల సంరక్షణ, అభివృద్ధి ప్రాంతాల' విధి. స్థిర వినియోగం ద్వారా స్థానికులు/ గిరిజన ప్రజలకు జీవనోపాధి కల్పించడం కూడా ఈ పథకం దీర్ఘకాలిక ఉద్దేశం.

ఆయుష్ శాఖ సహాయ మంత్రి శ్రీ మహేంద్రభాయ్ ముంజపర ఈ సమాచారాన్ని లిఖితపూర్వక సమాధానంగా ఇవాళ రాజ్యసభకు సమర్పించారు.

# డి-నోటిఫైడ్, సంచార తెగల వారి కోసం జాతీయ కమిషన్

న్యూఢిల్లీ, జులై 27:డి-నోటిఫైడ్, సంచార, ఉప-సంచార తెగల వారి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం జాతీయ కమిషన్‌ను (ఎన్‌సీడీఎన్‌టీ) ఏర్పాటు చేసింది. 12.02.2014 నాటి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా మంత్రిత్వ శాఖ దీనిని ఏర్పాటు చేసింది. గెజిట్ ఏర్పాటు తేదీ నుంచి 3 సంవత్సరాల కాలావధితో ఈ కమిషన్ ఏర్పాటు చేయడమైంది. డీఎన్‌టీల ప్రయోజనాలను కోరుతూ ప్రభుత్వం ఇప్పటివరకు పలు కింద పేర్కొన్న సంక్షేమ పథకాలను ప్రారంభించింది:

-డీఎన్‌టీ బాలురు, బాలికల నిమిత్తం డాక్టర్ అంబేద్కర్ ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్

- డీఎన్‌టీ బాలుర మరియు బాలికల కోసం నానాజీ దేశ్‌ముఖ్ హాస్టళ్ల నిర్మాణ పథకం.

- డి-నోటిఫైడ్, సంచార జాతులు మరియు ఉప సంచార జాతుల వారి (డీడబ్ల్యుబీడీఎన్‌సీ) కోసం అభివృద్ధి, సంక్షేమ బోర్డును 21.02.2019న ఏర్పాటు చేయబడింది.

- డి-నోటిఫైడ్, సంచార జాతులు, ఉప సంచార జాతుల గుర్తింపుప్రక్రియను పూర్తి చేయడానికి నీతీ ఆయోగ్ ద్వారా ఒక కమిటీని ఏర్పాటు చేశారు. నీతీ ఆయోగ్, ఆంత్రోపోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో (ఏఎన్ఎస్ఐ) డీఎన్‌టీ కమ్యూనిటీలను గుర్తించి వాటిని ఎస్సీ / ఎస్టీ / ఓబిసి విభాగంలో చేర్చే సర్వే పని కూడా జరుగుతోంది.

దీనికి తోడు, డిపార్ట్‌మెంట్ ఈ సమాజం యొక్క సంక్షేమం కోసం "స్కీమ్ ఫర్ ఎకనామిక్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ డీఎన్‌టీ కమ్యూనిటీస్ (ఎస్ఈఈడీ)"అనే ప్రత్యేక పథకాన్ని ఆమోదించింది. ఇది నాలుగు విభాగాలు కలవు:-

పోటీ పరీక్షలలో హాజరుకావడానికి డీఎన్‌టీ అభ్యర్థులకు మంచి నాణ్యత గల కోచింగ్ ఇవ్వడం.

వారికి ఆరోగ్య బీమా అందించడం.

సమాజ స్థాయిలో జీవనోపాధి చొరవను సులభతరం చేయడం;

ఈ వర్గాల సభ్యులకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం.

ఈ సమాచారాన్ని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి సుశ్రీ ప్రతిమా భూమిక్ ఈ రోజు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

# ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఆవాస సౌకర్యాలు

న్యూఢిల్లీ, జులై 27:నిరాశ్రయులైన, నిరుపేదలైన ట్రాన్స్‌జెండర్ల వ్యక్తుల ఆశ్రయం కోసం షెల్టర్ హోం ను ఏర్పాటు చేయడం సహా పలు సంక్షేమ చర్యలతో ఒక పథకాన్ని సామాజిక న్యాయం, సాధికారత శాఖ రూపొందిస్తోంది.

ట్రాన్స్‌జెండర్ల (లింగమార్పిడి చేయించుకున్న) కోసం 12 పైలెట్ షెల్టర్ హోమ్‌లను నిర్మించడమే కాక సమాజ ఆధారిత సంస్థలకు (కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్ - సిబిఒలు) గరిమ గృహాలను నిర్మించేందుకు ఆర్థిక సహాయాన్ని అందించడాన్ని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. ఈ పైలెట్ షెల్టర్ హోంలు మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, బీహార్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, ఒడిషాలలో ఉన్నాయి. నిరాశ్రయులు, పేదరికంలో ఉన్న ట్రాన్స్‌జండర్లకు సురక్షితమైన, భద్రత కలిగిన ఆశ్రయాన్ని అందించడం ఈ షెల్టర్ హోం ల ప్రధాన లక్ష్యం. ఈ షెల్టర్ హోంలు ఆహారం, వైద్యం, వినోద సౌకర్యాలతో పాటుగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు సామర్థ్య నిర్మాణం/ నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తాయి.

ఈ మంత్రిత్వ శాఖ ఎటువంటి పింఛను పథకాన్ని అమలు చేయడం లేదు. అయితే, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎన్ఎస్ఎపి)ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా, 3,384మంది ట్రాన్స్‌జెండర్లకు నెలవారీ పింఛనును అందిస్తున్నారు. ఈ సమాచారాన్ని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎ. నారాయణ స్వామి మంగళవారం నాడు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో ప్రతి ఒక్కరికి వైద్యం

## 100 పడకల ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే



రాజన్న సిరిసిల్ల, జులై 27:(నేటినిజం ప్రతినిధి): సుమారు నాలుగున్నర ఎకరాల సువిశాలమైన స్థలంలో 22 కోట్ల రూపాయలతో 100 పడకల సామర్థ్యంతో ఆధునిక సదుపాయాలతో,నియోజకవర్గ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ధార్మిక క్షేత్రం లో నిర్మించిన ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రి ప్రభుత్వ ప్రత్యేక చొరవతో అందుబాటులోకి వచ్చిందని వేములవాడ నియోజకవర్గం ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు.మంగళవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురం లోని 100వడకల ఆసువత్రిని సందర్శించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 100పడకల ఆసుపత్రి చాలా అద్భుతంగా ఉన్నదని వైద్య సిబ్బంది కూడా చాలా బాగా పనిచేస్తున్నారని అన్నారు. అలాగే చికిత్స కోసం వచ్చిన రోగులకు ఓర్పుతో సేవ చేయాలని అన్నారు. వేములవాడ నియోజకవర్గం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో,ప్రత్యేక చొరవతో అత్యాధునిక సదుపాయాలతో ఈ వందపడకల ఆస్పత్రినినిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు .ఇంకా ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలను త్వరలోనే మంత్రి తో మాట్లాడి సమకూరుస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి , అర్బన్ ఎం.పి.పి బూర వజ్రమ్మ , మెడికల్ సూపరిండెంట్ మహేష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ , ఏ.ఎం.సి చైర్మన్ గడ్డం హనుమాండ్లు జెడ్.పి.టి.సి మ్యాకల రవి , కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మినీ స్టేడియం నిర్మాణానికి చొరవ తీసుకోండి

## -ఎమ్మెల్యే రమేశ్ బాబుకు క్రికెట్ క్రీడాకారుల వినతి




రాజన్న సిరిసిల్ల, జులై 27:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో క్రికెట్ ఆడటానికి మినీ స్టేడియం నిర్మాణానికి చొరవ తీసుకోవాలని శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్ బాబుకు మంగళారం పట్టణానికి చెందిన విపిఎల్ కమిటీ సభ్యులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామీణ, పట్టణ నైపుణ్యం గల క్రికెట్ క్రీడాకారులు ఉన్నారని వీరికి సరైన గ్రౌండ్ సదుపాయం లేకపోవడం వలన జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిపోటీలోపాల్గొనలేకపోతున్నారని , మీరు దయచేసి క్రికెట్ కు సంబంధించిన మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు .వినతిపత్రం అందజేసిన వారిలో విపీఎల్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షకీల్, మహమ్మద్ అబ్దుల్ డాక్టర్ ఇమ్రాన్(ఆం ఎంపీ) సయ్యద్ షాహెద్ పాష ఉన్నారు.

# ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఇవ్వాలి

## రిజిస్ట్రేషన్ ఫీజు అమాంతం పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
## రైతు బీమా ను వెంటనే మంజూరు చేయాలి
## కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగస్వామియాదవ్



రాజన్న సిరిసిల్ల, జులై 27:(నేటినిజం ప్రతినిధి): ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఇవ్వాలని ,అలాగే రైతు బీమాను వెంటనే మంజూరు చేయాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సంగ స్వామి యాదవ్అన్నారు .మంగళవారం వేములవాడ విలేకర్ల సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్ మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ ఫీజు 1800 లాక్ గజము ఉన్నదాన్ని 2210 పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు బంగారు తెలంగాణ అని చెప్పుకోవడానికి తప్ప ఎలాంటి లాభం లేదని అని ఆయన అన్నారు పేద మధ్య తరగతి కుటుంబాల పైన పెనుభారంగా ఈ రోజు రిజిస్ట్రేషన్ ఫీజు లు పెంచడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కరోనా వల్ల చనిపోయిన రైతుల కు రైతు బీమా ఇంతవరకు ఇయ్యంది ఒక లక్ష మంది ఉన్నారు రైతు బీమా మేము ఇస్తున్నా మేము ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వీళ్ళకు రైతు లేకపోతే ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని వీళ్ళకు రైతు బీమా వచ్చే విధంగా చేయాలని ఆయన కోరారు. నిన్న మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు అందిస్తున్నామని ఆయన అన్నారు కానీ ప్రతి ఊరిలో 5,6 ఇవ్వడం వల్ల ఆ ఊరిలో పేదవారు అయిపోయినట్టేనా... ఇంకా చాలా మంది పేద వారు ఉన్నారు కాబట్టి వెంటనే ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేయాలని స్వామి కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, కార్యదర్శి లింగంపల్లి కిరణ్, దాడి మల్లేశం, ప్రకాష్, ఉపాధ్యక్షులు తంగెళ్ల గణేష్, వస్తాదు కృష్ణ, కార్యవర్గ సభ్యులు ఖమ్మం గణేష్, మరి పెల్లి రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు కోలకాని రాజు తదితరులు ఉన్నారు

# రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు





రాజన్న సిరిసిల్ల, జులై 27:(నేటినిజం ప్రతినిధి): ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు రాజన్న ను దర్శించుకొనెందుకు ఆలయ చేరుకోగా ఆలయ ఏ ఈ ఓ హరికిషన్ పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానించారు అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయం కోడె పూజ చేసి స్వామి వారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేసినారు.స్వామి వారి కల్యాణమండపం లో ఆలయ అర్చకులు వేదపండితులు వేదోక్త ఆశీర్వచనం చేసిన పిదప ఆలయ ఏ ఈ ఓ బ్రహ్మణగారి శ్రీనివాస్ శాలువతో సత్కరించి లడ్డు ప్రసాదం అందజేసినారు×.

ఎమ్మెల్యే రమేష్ బాబు కి ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం×ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారము 61 సంవత్సరాలు వయోపరిమితి అమలునకు జి ఓ 888 సవరణ చేసి త్వరితగతిన అమలు చేయుటకు అశేష కృషి చేసినందు మరియు అపరిష్కృతంగా నున్న ఏ ఈ ఓ ప్రమోషన్లు పొందుటకు కృషి చేసినందుకు ఎమ్మెల్యే కి ఆలయ ఉద్యోగుల సంఘం శాలువల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ,కార్యదర్శి పేరుక శ్రీనివాస్ గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు ఏ ఈ ఓ ప్రతాప నవీన్ ,పర్యవేక్షకులు నటరాజు,గోలి శ్రీనివాస్,తిరుపతి రావు, అలీ శంకర్ మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.